నవతెలంగాణ
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
1
సోమవారం 14 ఆగస్టు 2023

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అన్నారు. చిట్యాల మున్సిపాలిటీలోని 2 వార్డ్ సుందరయ్య నగర్‌లో గత కొన్ని రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలు పడి ఉండటాన్ని తెలుసుకొని ఆదివారం ఎల్లమ్మ గుడి నుండి సుందరయ్య నగర్ కాలనీ వరకు మట్టి పోయించి చదును చేయించి ఆయన కాలనీవాసులతో మాట్లాడారు. కురుస్తున్న వర్షాలకు పాములు ,తేళ్ల ,క్రిమి కీటకాల కు , కరెంటు వైర్లకు , జాగ్రత్తగా ఉండాలని మన ఇండ్ల ముందున్న, చెత్తను పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోనేటి కృష్ణ, సిల్వర్ శేఖర్, జిట్టా చంద్రకాంత్, గండమల్ల శంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో ఎస్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీసు కళాబృందంచే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాబృందం ఇన్‌చార్జి కృష్ణ సైబర్ నేరాలు, పోన్ లింకు వల్ల గాని, ఇతర ఆన్లైన్ ఆర్థిక నేరానికి మోసపోతే 1930 కు కాల్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పోలీసులు, గ్రామ ఉపసర్పంచ్ కన్నెబోయిన గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతీ, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

బోనాల పండుగ సంస్కృతీ,సాంప్రదాయాలను ప్రతిబింబింపజేస్తాయని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యంత ప్రాశస్త్యం కలిగిన ఊర ముత్యాలమ్మ బోనల పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ముత్యాలమ్మ బజార్‌లో గల ముత్యాలమ్మ దేవాలయంలో సతీమణి సునీతాతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామ దేవతలను ఆరాధించి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం శతాబ్దాల క్రితం మొదలైందని చెప్పారు.పట్టణ ప్రజలపై ఊర ముత్యాలమ్మ కరుణా కటాక్షాలు చూపాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. ప్రకృతికి అనుకూలంగా బోనాల పండుగ నిర్వహిస్తున్నందున ఊర ముత్యాలమ్మ తో పాటు ప్రకృతి కరుణించి సకాలంలో వర్షాలు పడేలా చూడాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా పంటలు బాగా పండి ప్రజల ఆదాయం పెరగాలని ముత్యాలమ్మ తల్లికి విన్నవించుకున్నట్లు ఆయన చెప్పారు. తెలంగాణా సంస్కృతి సంప్రాదాయాలకు గ్రామ దేవతలను కొలుస్తూ బోనాల పండుగ నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తుందన్నారు. పట్టణ ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

నవతెలంగాణ-మోత్కూర్

పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మోత్కూరు మండలం ముస్సిపట్ల మాజీ ఎంపీటీసీ కొల్లూరు మల్లయ్యతో పాటు మరికొంతమంది కార్యకర్తలు ఆదివారం తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మోత్కూరు మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, వైస్ ఎంపీపీ బుశిపాక లక్ష్మీనారయ్య, నాయకులు పైళ్ల దయాకర్ రెడ్డి, నోముల బుగ్గరాములు, జిల్లాల మచ్చేందర్ రెడ్డి, బుశిపాక యాదగిరి, బోనగిరి హరీష్, కొల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-భువనగిరి



పట్టణంలోని స్థానిక 8వ వార్డు లో చేస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మెన్ ఎన్నబోయిన ఆంజనేయులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు పంగరెక్క స్వామి , కోప్షన్ సభ్యులు ఇట్టబోయిన సబితా గోపాల్ , కిరణ్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మూడు పార్టీల్లోనూ... ముసలం

- టికెట్ కోసం పెరుగుతున్న ఆశావాహులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో అదే పరిస్థితి..
- ఇతర పార్టీల్లోకి అదును కోసం వెయిటింగ్

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఎన్నికల సీజన్ షూరూ అయ్యింది. ఈ క్రమంలో జిల్లాలో ఎక్కడ చూసినా.. ఏ పార్టీ సీటు ఎవ్వరికీ దక్కనుంది..? ఏ కోణంలో వారికి ఆయా పార్టీల టికెట్ దక్కుతుంది..? వారి బలబలాలేంటి..? అన్న చర్చ పెద్దఎత్తున జరుగుతోంది. ఈ తరహా చర్చకు రాజకీయవర్గాలే కాదండోయ్.. ఏ నలుగురు గుమిగూడినా.. ఇదే తరహాలో చర్చించుకుంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఇదంతా ఒక ఎత్తయితే.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో మాత్రం ఇప్పట్నుంచే టికెట్ల కేటాయింపు విషయంపై రచ్చరచ్చ జరుగుతోంది. ఏ రోజుకారోజూ రాజకీయ సమీకరణాలు మారడం.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కామన్ అయ్యిందనే చెప్పాలి. వాస్తవానికి యావత్ తెలంగాణ మొత్తం రాజకీయాలు ఒక ఎత్తయితే.. ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాలు మరో ఎత్తనే చెప్పాలి. మొదట్నుంచీ ఉమ్మడి జిల్లాపై కమ్యూనిస్టు పార్టీ ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల జిల్లాలో రాజకీయ చైతన్యం కాస్తంత ఎక్కువగా



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, మరో రెండు పార్లమెంటు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే పార్లమెంటు ఎన్నికల సంగతి ఎలా ఉన్నా.. ప్రస్తుతం ఎక్కడా చూసినా అసెంబ్లీ ఎన్నికలు, టికెట్ల కేటాయింపు వ్యవహారమే ప్రధానంగా విన్పిస్తోంది.అయితే ఆయా నియోజకవర్గాలకు సంబంధించి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో గ్రూప్ వార్ తారాస్థాయికి చేరింది. ప్రధానంగా కొన్ని నియోజకవర్గాల్లో బాహాబాహీకి దిగే పరిస్థితి నెలకొంది.ప్రధానంగా కొన్ని నియోజకవర్గాల్లో ఒకే పార్టీలో ముగ్గురు నలుగురు ఆశావాహులు టికెట్ ఆశిస్తుండడం.. ఆయా పార్టీల అధినాయకత్వానికి కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోందనే చెప్పాలి. టికెట్ కేటాయింపు విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా.. ఇతర పార్టీల్లోకి జంప్ చేసేందుకు లీడర్లు ఇప్పటికే ఖర్చీఫ్ వేసి పెట్టుకున్నారంటే.. పరిస్థితి ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏయే నియోజకవర్గాల్లో పోటీ బలంగా ఉందంటే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సగానికి పైగా నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల నుంచి బలమైన పోటీ ఎదురవుతోంది. ప్రధానంగా బీఆర్ఎస్ విషయానికొస్తే.. కోదాడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, నల్లగొండ, మునుగోడు, నకిరేకల్, ఆలేరు నియోజకవర్గాల్లో టికెట్ ఆశావాహుల సంఖ్య సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతోంది. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే.. నకిరేకల్, మిర్యాలగూడ, ఆలేరు, మునుగోడు, భువనగిరి, ఆలేరు, దేవరకొండ నియోజకవర్గాల్లో టికెట్ కోసం నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. రెండు మూడు నియోజకవర్గాల్లోనైతే.. ఏకంగా బాహాబాహీకి దిగిన సందర్భాలు లేకపోలేదు.బీజేపీ విషయానికొస్తే.. ఉమ్మడి జిల్లాలో పెద్దగా ప్రభావం చూపకపోయినప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. కానీ ఆ పార్టీలో ఉన్న ఒక్కరిద్దరూ నేతల వల్ల ప్రజల నుంచి పెద్దగా స్పందన ఉండట్లేదు.బీజేపీకి సంబంధించి నల్లగొండ, మునుగోడు, భువనగిరి నియోజకవర్గాల్లో కొంతమేర కోల్డ్‌వార్ నడుస్తోంది.

ఛాన్స్ దొరికితే జంప్..

నిజానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో కొన్ని నియోజకవర్గాల్లో తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. ఈ క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యేల విషయంలోనూ ఉమ్మడి జిల్లా నుంచి ఒకటీ రెండూ సీట్లు మారతాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు కాస్తంత డిమాండ్ పెరిగింది. ఒకవేళ బీఆర్ఎస్‌లోని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ దక్కకపోయినా.. లేదా గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇస్తామని చెప్పి సర్దిచెబుతూ వచ్చిన లీడర్లు తమకు అవకాశం దొరికితే.. ఇతర పార్టీలోకి జంప్ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండడం చర్చనీయాంశం అవుతోంది. దీంతో చివరి నిమిషంలో ఏ అభ్యర్థికి టికెట్ కన్‌ఫర్మ్ అవుతుంది..? ఎవరు ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారోనన్న సందిగ్ధత లేకపోలేదు.

అడుగడుగునా సమస్యలే..!

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్లఐలయ్య



నవతెలంగాణ -బొమ్మలరామారం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు ప్రభుత్వం విఫలమైందని, గిరిజన తండాలో అడుగడుగున సమస్యలతో బాధపడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని లక్ష్మీ తండలో పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు..కెసిఆర్ కు మద్యం దుకాణాలపై ఉన్న ప్రేమ గిరిజన తండాలో లేకపోయిందని విమర్శించారు. అడుగడుగునా సమస్యలతో కొట్టుమిట్లాడుతున్న గిరిజన తండాల కోసమే పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం తండా వాసులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.రాత్రి తండాలో బస చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మల్లేష్, మహేష్ గౌడ్, హేమంత్ రెడ్డి, మోకు మధుసూదన్ రెడ్డి,శ్రీహరి, చీరసత్యనారాయణ, నందరాజ్ గౌడ్, సురేందర్ రెడ్డి, జూపల్లి శ్రీకాంత్, మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-నకిరేకల్



బీఆర్ఎస్ సర్కార్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అబ్బగొని విజయలక్ష్మి శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు చిట్టిపాక సైదులు ఆధ్వర్యంలో మండలంలోని ఓగోడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుండి 50 కుటుంబాలు ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలను కప్పి తమ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు లోడే రమేష్, మార్కెట్ డైరెక్టర్ పల్లెబోయిన స్కైలాప్, బాషాపాక సతీష్, చెట్టుపల్లి అంజయ్య, చిట్టిపాక శ్రీనివాస్, చిట్టిపాక్ విజయ్ కుమార్, బోడ జ్యోతి, గద్దపాటి విజయ్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు నియామక ఉత్తర్వులు అందజేత

నవతెలంగాణ- భువనగి రూరల్

అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని 11 కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలలో కాంట్రాక్టు బేసిస్ కింద 11 మందికి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ గా, 30 మందికిపోస్ట్ గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ గా మొత్తం 41 మందికి నియామక పత్ర ఉత్తర్వులు స్థానిక సంస్థల కలెక్టర్ వీరా రెడ్డి అందజేశారు. వెంటనే విధులలో జాయిన్ కావలసిందిగా ఉత్తర్వులలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కర్రలే కరెంటు స్తంభాలు

నవతెలంగాణ-చండూరు

గట్టుప్పల్ మండలంలోని పలు గ్రామాలలో స్తంభాలు, విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండి ప్రమాదాలకు అనుకూలంగా మారాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తెరట్ పల్లి గ్రామంతో పాటు, గట్టుప్పల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మ తండా లో ఎక్కడ చూసినా చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు దర్శనమిస్తున్నాయి. స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనితోపాటు చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు కూడా వంగిపోయి ఉండడంతో రైతులు భయాందోళనలకు గురైతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలను పరిష్కరించక పోవటంతో చాలా చోట్ల రైతులు తాత్కాలికంగా కర్రలను కరెంటు స్తంబాలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇవి గాలి దుమారాలు వస్తే కిందపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి నూతన స్తంబాలను ఏర్పాటు చేయాలని,ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకొవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌ని వివరణ కోరగా కొత్త స్తంభాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, రాగానే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పెచ్చులూడిపడుతున్న ఆస్పత్రి భవనం

- నత్తనడకన ఆస్పత్రి నిర్మాణ పనులు
- వర్షం వస్తే గోడలకు విద్యుత్ షాక్
- కనీస సదుపాయాలు కరువు

నవతెలంగాణ-పెద్దవూర

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పైకి రంగులతో కనబడుతున్నా లోపల మాత్రం కూలిపోయి, ఇనుప ఊచలు తేలి పైన పటారం లోన లోటారం అన్న చందంగా ఉంది ఈ ఆస్పత్రి దుస్థితి. 1994 లో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఇప్పటికి 28 ఏండ్లు గత10 ఏండ్ల కింద చిన్న మరమ్మత్తులు చేపట్టారు. ఆ తరువాత 4 ఏండ్ల కింద మరమత్తులకు 3లక్షలు కేటాయించారు. ఆస్పత్రుల్లో చేసే పనిఎక్కువ ఉన్నందున టెండర్లు రాక పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దాంతో మరింతగా స్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో గదులలోకి వెళ్లాలంటేనే వైద్యులు, సిబ్బంది జంకుతున్నారు. వర్షం వస్తే ఆస్పత్రి గోడలకు షాక్ వస్తుంది. దీంతో సిబ్బంది భయం, భయంగా డ్యూటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పండింది.

పెచ్చులూడుతున్న స్లాబు..

పెద్దవూర ప్రభుత్వ ఆస్పత్రిలో మొత్తం లాబ్, వ్యాక్సినేషన్, ఫార్మాసి, కంప్యూటర్, డెలివరీ రూమ్, డాక్టర్ గది, పీహెచ్ఎన్, యూడీసీ ఉండే మొత్తం 08 గదులు, ఒక వరండా ఉన్నాయి. ఇందులో యూడీసీ పూర్తిగా కూలిపోయింది. లాబ్, వ్యాక్సినేషన్ గదులు 80 శాతం శిథిలవస్తకు, వరండా వర్షం వస్తే వర్షపు నీళ్ల కరెంటు మీటరు లోనుంచి కారి గోడలకు విద్యుత్ వస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రి భవనం స్లాబులు అనేక చోట్ల పెచ్చులూడి రాడ్లు బయటపడి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. శిథిలావస్థకు చేరి ఏండ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో సిబ్బంది ప్రాణ భయంతో వణికి పోతున్నారు.

భయపడుతున్న రోగులు

మరమ్మతులు చేపట్టకపోవడం గోడలకు కరెంట్ షాక్ వస్తుండడం, పెచ్చేలు ఊడి పడిపోతుండడంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలో 46 గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ ఆస్పత్రి స్థితి గతులకు భయపడి ఇక్కడ చికిత్స పొందేందుకు ప్రజలు జంకుతున్నారు. దీంతో రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. అంతేగాక కనీసం అక్కడకి వచ్చిన రోగులు టాబ్లెట్ వేసు కుందామన్న చుక్క నీళ్లు దొరకని స్థితి. సిబ్బంది ఎవరి బాటిళ్లలో వారే నీళ్లు తెచ్చుకుంటారు. గతంలో స్టాఫ్ నర్స్ పరిస్థితి మరీ ఘోరం బాటిళ్లలో నీళ్లు అయిపోయినప్పుడల్లా బయటికి వెళ్లాల్సివచ్చేది ఆసమయంలో రోగులు టాబ్లెట్లకు వస్తే లేరని వెళుతున్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కొంత మెరిగయింది. పెదవూరలో హాస్పిటల్ శిథిలావస్తకు చేరడంతో జెడ్పీ సమావేశాలలో ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి అనేక సార్లు ఆస్పత్రి అంశాన్ని తీసుక రావడంతో మండలానికి 1.58 కోట్లతో నూతన ఆస్పత్రి మంజూరైంది. దీంతో ఎంపీడీఓ కార్యాలయం ముందు నిర్మాణం చేపట్టారు. ఊరికి మధ్యన ప్రభుత్వ కార్యలయాల ఆవరణలో ఏర్పాటు చేస్తుండడం, ఆస్పత్రి గుర్తు తెలియని మృత దేహం వస్తే గుర్తుపట్టి తీసుకెళ్లె వరకు కొంత ఆలస్యం జరిగి నప్పుడు వాసన, కరోనా లాంటి వ్యాదులు వచ్చినపుడు ప్రజలకు ఇబ్బంది కలుగ కుండా ఈ ఆస్పత్రిని మార్కెట్ యార్డు పక్కన ఏర్పాటు చేయాలని కొంత చర్చి జరిగింది. దాంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. కానీ భూమి కొంత మంది కబ్జా చేసుకున్నారని తెలవడంతో తిరిగి ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆగిపోయిన పనులు గత 4, 5 రోజులుగా నడుస్తున్నాయి.

నూతన ఆస్పత్రి పనులు ప్రారంభమయ్యాయి..

వైద్యాధికారి నగేష్

ఆస్పత్రి సమస్యలపై గతంలో అనేకసార్లు పైఅధికారులకు నివేధికలు అందజేశాము. 3 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లుకు ఎవరు రాకపోడంతో పనులు ఆగిపోయాయి. ఈ విషయం గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు, ఏఎల్ఏ దృష్టికి కూడా తీసుకెళ్లాము. నూతన భనవన మంజూరయి పనులు జరుగుతున్నాయి.





15న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న శాసనమండలి చైర్మెన్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11:30 గంటలకు ప్రసంగం, 11:40 గంటలకు బాల బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు, 12 గంటలకు ఆస్తుల పంపిణీ, 12:15 గంటలకు ప్రశంస పత్రాల పంపిణీ, 12:30 గంటలకు జాతీయ జీతాలపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



నవతెలంగాణ

నల్లగొండ

సోమవారం 14 ఆగస్టు 2023

గ్రంథాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని గ్రంథాలయం, సమాచార కేంద్రంను ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆదివారం సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించి, గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుములలో శ్రీనివాసులును, సహకరిస్తున్న దాతలను ఆయన అభినందించారు. గ్రామంలోని యువతి, యువకులు విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేరుకుంటుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారికి పుస్తకం అందించి సత్కరించారు.

గిదేంది.. సారూ..!

- నోటికాడిది.... గుంజుకోవడం.. ఏమిటి..!! ●ఆశ పెట్టి.... ఆడిఆశలు చేశారు..!!! ●కలం కార్మికులతో కచరా రాజకీయం
- వివాదాల్లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు ●కబ్జాదారుల పాలౌతున్న ప్రభుత్వ భూములు ●పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఇట్ల చేయడం న్యాయం కాదు...! ఇండ్ల స్థలాల ఆశపెట్టి.. ఇబ్బందులు పెట్టడం సరికాదు.... కలం కార్మికులతో కచరా రాజకీయం.... ముందుకు నెట్టి.. ముచ్చట చెప్పి దాడులు చేస్తుండ్రు.... అధికారానికి కొమ్ముగాస్తున్న అధికారులు..... న్యాయం కోసం గోసపడుతున్న జర్నలిస్టులు..... మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా పాలనా దౌర్జన్యం. అధికార పక్షానికి అధికారులు పూర్తిస్థాయిలో మద్దతునిస్తూ.. న్యాయాన్ని అన్యాయంగా మార్చేస్తున్నారు. అన్యాయాన్ని న్యాయంగా చూపిచ్చేస్తున్నారు. ఇదెక్కడి పద్ధతని ప్రశ్నించే గొంతులు కరువవుతున్నాయి. వాళ్ల చేసిందే చట్టమవుతుంది. వాళ్ల మాట్లాడిందే న్యాయవుతుంది. ప్రజల ఆశలతో చెలగాటమాడే రాజకీయ క్రీడ రసవత్తరంగా సాగుతుంది. మాటలకు.. చేతలకు ఆకాశానికి నేలకు ఉన్నంత వ్యత్యాసం ఉంటుంది. ఏళ్ల తరబడి సమాజ సేవలో ఉన్న జర్నలిస్టులకు కనీసం గూడు నిర్మించుకునేందుకు వందగజాల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడుతున్న డ్రామాలతో కలంకార్మికులు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మీకు స్థలాలు ఇస్తున్నాం తీసుకోండని... వివాదాస్పద భూములను విలేకరులకు చూపించి... సొంత డబ్బులతో లక్షలు వెచ్చించి చదును చేసుకోమని చెప్పేసి... తీరా చదును చేసుకున్నాక... కొందరిని ఆ భూముల పైకి ఉసిగొలిపి... విలేకరులను భయభ్రాంతులకు గురిచేసి... ఆ భూముల పైనుంచి వెళ్లిపోయే విధంగా దాడులు చేయించే ఆటవిక న్యాయం మిర్యాలగూడ నియోజకవర్గంలో అమలవుతుంది. అధికారులు.. ప్రజాప్రతినిధులు మాటలు మార్చేస్తున్నారు. కలం కార్మికులతో వారి ఆశలతో కచరా రాజకీయాలు చేస్తున్నారు. ఎవరైనా.. ఎవరికైనా పెడతామంటేనే ఆశపడతారు... అసలు ఏమీ లేదంటే ఊరుకుంటారు. అలాకాకుండా కలంకార్మికుల పేద నిస్సహాయ జీవితాలతో చెలగాటమాడే విధంగా వారి వృత్తిని వ్యక్తిత్వాలను చులకన చేసే విధంగా వ్యవహరిస్తున్న తీరు కలం కార్మికులకు ఆవేదన కలిగిస్తుంది. అందుకు నిదర్శనం గానే మిర్యాలగూడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విలేకరులకు ఇస్తామని మాటిచ్చిన ఇంటి స్థలాల వ్యవహారంలో జరుగుతున్న ద్వంద్వవిధానాలపై ప్రత్యేక కథనం ఇది.

వడ్డించే వారు మా వాడు అయితే....బంతి లో ఎక్కడ కూర్చున్న తృప్తిగా భోజనం చేయొచ్చు....అన్న సామెతను తీసిపోనిదిగా... మిర్యాలగూడ నియోజకవర్గంలో కబ్జాల పర్వం కొనసాగుతున్నది. నిత్యం ప్రజా జీవితంలో నిస్వార్థంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇల్లు కోసం 100 గజాల స్థలం అడిగితే పాలకులకు, అధికారులకు మనసు రావటం లేదు. అధికార పార్టీ నాయకులు ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని దర్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ అధికార పార్టీ నాయకులకు ఒత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేస్తున్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అన్ని నియోజకవర్గంలోని మండలాల్లో విలేకరులకు ఇస్తున్నారు. నల్గొండలో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఇండ్ల స్థలాలు ఇప్పటికే ఇవ్వాలని ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో కూడా అన్ని మండలాల విలేకరులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే భాస్కరరావు ఆదేశించారు. కానీ జర్నలిస్టులు సొంతగానే ప్రభుత్వ భూమిని గుర్తించి సొంత ఖర్చులతో చదును చేసుకున్నాక.. చివరికి అధికార పార్టీ నాయకులు అడ్డుపడడంతో వివాదాలు నడుస్తున్నాయి. స్థలం ఇచ్చినట్లే ఇచ్చి అనుచరులకు ఉసిగొలిపి జర్నలిస్టులకు అడ్డుపడి గొడవలకు ఆజ్యం పోశారు.

అన్ని మండలాల్లో వివాదాలే...!

మిర్యాలగూడ నియోజవర్గంలో జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని గత కొంతకాలంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. దాని ఫలితంగా ఎమ్మెల్యే భాస్కరరావు స్పందించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ పట్టణంలోని హైదలాపురం శివారులో సర్వే నెంబర్ ఐదు లో నాలుగు ఎకరాలు 20 గుంటలు భూమిని కేటాయించారు. అట్టి భూమిని రెవెన్యూ అధికారులు ఐదుసార్లు సర్వే చేసి ప్రభుత్వ అసైన్డ్ భూమిగా గుర్తించి నక్ష వేశారు. లే ఔట్ చూసుకొని 10 లక్షలు ఖర్చు చేసుకొని గుట్టగా,ఎనేగా ఉన్న భూమిని జర్నలిస్టులు చదును చేసుకున్నారు. అంతా శుభ్రం అయ్యాక అధికార పార్టీకి చెందిన కొందరు ఆ భూమిలో తమ భూమి ఉన్నదని అడ్డుపడుతున్నారు. ఇతరులకు కేటాయించిన ఆ భూమిని పహానిలో దిద్దుబాటు చేసుకుని 35 గుంటలు.. 26 గుంటలు నమోదు చేయించుకుని ఇప్పుడు ఆ భూమి తమది అంటూ అడ్డుపడుతున్నారు. సర్వే చేసిన అధికారులు ఆ సర్వే నెంబర్లలో వేరే వారికి భూమిలేదని సర్వే చేసి చెప్పినప్పటికీ.. కావాలని అడ్డుపడుతూ వివాదాలు సృష్టిస్తున్నారు. ఆ భూమి హక్కుదారులు కానప్పటికీ ప్రభుత్వ భూమిపైకి ఇతరులు వస్తున్నప్పటికీ అధికారులు మాత్రం వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకడు వేస్తున్నారు. దీనిబట్టి చూస్తే ప్రజాప్రతినిధుల ఒత్తిడి ఉన్నట్లు అర్థమవుతుంది. అంతేగాక వేములపల్లి మండలంలోని బుగ్గబాయిగూడెం గ్రామంలో సర్వే నెంబర్ 652 లో సుమారు 7, 8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ ఉన్న గుడికి సంబంధం లేకుండానే రోడ్డుకు మరోవైపు ఎకరం 20 గుంటలు జర్నలిస్టులకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. రాళ్ల రప్పలతో ఉన్న ఆ గుట్టను సుమారు మూడు లక్షల ఖర్చు చేసి గత నాలుగు రోజులుగా శుభ్రం చేసుకుంటున్నారు. పనులు ప్రారంభోత్సవానికి , బుగ్గబాయిగూడెం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులను, నాయకులను ఆహ్వానించి వారితోనే పనులు ప్రారంభించారు. నాలుగు రోజుల తర్వాత ఆ గ్రామ సర్పంచులు యాదవ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టి జర్నలిస్టులపై దాడులకు ఉసిగొలిపారు. శనివారం అక్కడ పనులు చేస్తున్న జర్నలిస్టులపై దాడికి దిగి ఇద్దరిని గాయపరిచారు. దీంతో న్యాయం కోసం జర్నలిస్టులు ఆందోళన చేయడంతో పాటు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే అడవిదేవులపల్లి విషయానికొస్తే సర్వే నెంబర్ 25 లో సుమారు 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది అందులో ఎకరం భూమిని జర్నలిస్టులకు కేటాయించారు. అక్కడ విలేకరుల సైతం సుమారు లక్షన్నర ఖర్చుపెట్టి ఆ భూమిని చదును చేసుకున్నారు. అక్కడున్న విలేకరులందరికీ రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చేందుకు అన్ని పత్రాలు సిద్ధం చేశారు. అంతలోనే కొందరు తమకు గతంలో పట్టాలు ఇచ్చారని ఆ భూమి తమదంటూ విలేకరులకు ఇచ్చిన భూమిపై వచ్చారు. విలేకరులతో వాగిద్వాదానికి దిగారు. పట్టాలు ఇవ్వొద్దని అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి చేయడంతో పట్టాల పంపిణీ నిలిపివేశారు. ఇక మాడుగులపల్లి మండల విలేకరుల పరిస్థితి మరి విచిత్రంగా మారింది. ఇళ్లస్థలాల కోసం జర్నలిస్టులు ఏ ఎంఎల్ఏ వద్దకు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మండలం మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్గొండ నియోజకవర్గాల పరిధిలో ఉండటం వలన ఒకరి వద్దకు వెళితే మరొక దగ్గరికి వెళ్లాలని ఒకరిపై ఒకరు ఇతరుల పేర్లు చెబుతూ కాలం దాటవేస్తున్నారు. దామరచర్ల మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అక్కడ ఉన్న విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పాలకులు, అధికారులు ఆసక్తి చూపించడం లేదు. ఇళ్ల స్థలాల విషయం తెరపైకి రాకుండా అడ్డుపడుతున్నారు.

అధికారానికి మద్దతు తెలుపుతున్న అధికారులు

జర్నలిస్టుల ఇండస్థలాల విషయంపై నియోజవర్గ వ్యాప్తంగా వివాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇళ్లస్థలాలు ఇచ్చినట్లు ఇచ్చి తమ అనుచరులను ఉస గొల్పి అడ్డుపడేలా చేశారు. విలేకరులపై దాడులు చేసేందుకు ప్రయత్నించిన, దాడులు చేసిన అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా విలేకరుల కేటాయించిన భూముల పైకి వచ్చి కొందరు ఘర్షణలు చేస్తున్నప్పటికీ దాడులకు పాల్పడుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారుల నుంచి ఎలాంటి చర్యలు ఉండటం లేదు పేదలైన విలేకరుల కంటే కబ్జాదారులకే అధికారుల వద్ద పెద్ద ఎత్తున ప్రాధాన్యత లభిస్తుంది.

ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ఇళ్లస్థలాలు కేటాయించాలని మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల జర్నలిస్టులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆర్డీవో ఇచ్చిన హామీ ప్రకారమే స్థలం వద్దకు వెళ్లి చదను చేసి అంతా శుభ్రం చేసుకోగా ఇప్పుడు కొందరు అధికార పార్టీ నాయకులు వచ్చి అడ్డుపడటం పై జర్నలిస్టులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూపాయి...రూపాయి కూడబెట్టుకొని ఇంటి స్థలం కోసం ఖర్చు చేస్తే...తీరా ఇప్పుడు కొందరు అడ్డుపడటం ఏమిటని....దీని వెనుకాల అధికార పార్టీ ప్రజా పతినిధులు ఉన్నారని ఆరోపిస్తున్నారు. న్యాయం చేయాలని, హక్కుగా రావాలిసిన ఇంటి స్థలం ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న స్థలాన్ని కేటాయించాలని కలం కార్మికులు కోరుతున్నారు.



జన జాగరణను జయప్రదం చేయండి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం

నవతెలంగాణ-మునుగోడు

బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు, అఖిల భారత రైతు సంఘాలు ఆగస్టు14న దేశవ్యాప్తంగా నిర్వహించే నైట్ విజిల్ జన జాగరణను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం ప్రజలకు పిలుపునిచ్చారు. మునుగోడు స్థాయి ప్రజా సంఘాల జనరల్ బాడీ సమావేశం మునుగోడు అమరవీరుల స్మారక భవన్‌లో వరికుప్పల ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బండ శ్రీశైలం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా కార్మికుల, రైతుల జీవితాల్లో ఏమాత్రం మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే కుట్ర చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మడానికి తెచ్చిన నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మోగుదాల వెంకటేశం, యాసరాని శ్రీను, సాగర్ల మల్లేష్, యాట యాదయ్య, ముత్తిలింగం తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నవతెలంగాణ-కేతెపల్లి

సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కేతపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామంలో రూ.10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ పనులకు, రూ.10 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, ఉప్పలపాడు గ్రామంలో 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన, వైకుంఠ ధామంను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో పర్యటించి ఆప్యాయంగా పలకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబాటు

ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



గత పాలకుల నిర్లక్ష్యంతోనే నల్లగొండ వెనుకబడిందని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని 13,14 వార్డులలో మర్రిగూడ రేణుకా ఎల్లమ్మ దేవస్థానం నుండి బొద్రాయి వరకు రూ. 60 లక్షల వ్యయంతో డబల్ సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మర్రిగూడలో డబల్ సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీఆర్ఎస్ పాలనలో నేడు రాష్ట్రం ఎవరు ఊహించని విధంగా కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మర్రిగూడలో సుమారు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ నుండి జేరిపోతుల అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రేగట్టే మల్లికార్జునరెడ్డి, వార్డు కౌన్సిలర్ ఊట్కూరి వెంకట్‌రెడ్డి, జేరిపోతుల భాస్కర్ గౌడ్, బొజ్జ వెంకన్న, కో ఆప్షన్ మెంబర్ గున్‌రెడ్డి రాధిక యుగెందర్‌రెడ్డి, సందినేని జనార్దన్ రావు, తుమ్మల గోవింద్‌రెడ్డి, తుమ్మల శంకర్‌రెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బీపంగి కిరణ్, మధుసూదన్‌రెడ్డి, మందడి వెంకట్‌రెడ్డి, కడారి యాదయ్య, బొజ్జ యాదయ్య, బీపంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల రక్షణ చట్టం అమలు చేయాలి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



వివిధ రాష్ట్రాల నుండి వలసలు వచ్చి పనిచేస్తున్న వలస కార్మికులకు కేంద్ర ప్రభుత్వం 1978 లో తెచ్చిన కార్మిక చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు తిరుపతి రామ్మూర్తి, దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న వలస కార్మికుల సమావేశానికి నలగొండ నుండి వెళ్తున్న వలస కార్మికుల వాహనాన్ని దొడ్డి కొమరయ్య భవన్ దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుండి తెలంగాణకు వలస వచ్చి ఉపాధి కోసం పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉత్పత్తి రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వలస కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రమాద బీమా, పని భద్రత, కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సాగర్ల యాదయ్య బీహార్ హమాలి మేస్త్రీలు సురేందర్, మండల్,తిలక్ పటేల్, ధర్మగిరి, ముఖేష్,మితిలేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి

- మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ డబ్బికార్

నవతెలంగాణ-మిర్యాలగూడ



సామాజిక సేవలో యువత ముందుండాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ డబ్బికార్ మల్లేష్ కోరారు. ఆదివారం స్థానిక రవీంద్ర నగర్ కాలనీలోని రవీంద్ర భారతి పాఠశాలలో ప్రకాష్‌నగర్, రవీంద్రనగర్, వడ్డెరగూడ కాలనీల డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి యువత ఎంతో కీలకమని ఆ యువత ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరారు. దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. క్రమశిక్షణగా ఉండి అందరికీ ఆదర్శంగా యువత ఉండాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించి,ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి 3వేలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ భావండ్ల పాండు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దేశి రామ్ నాయక్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు నాగేందర్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో ఉన్న సమస్యలను, కావాల్సిన సౌకర్యాలను గురించి స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ మినీ స్టేడియంలో కావాల్సిన సౌకర్యాలను అవసరమైన ఏర్పాట్లను త్వరలో చేయిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు ఆదిల్, సాయి, ఆసిఫ్, శ్రీకాంత్, సతీష్, నవీన్, హరీష్, పరమేష్, వేణు, ప్రేమ్, సురేష్, ఫయాజ్, భాను, సోహెల్, శేఖర్ ఉన్నారు.

విలేకర్లపైదాడి చేసిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-వేములపల్లి



కులం పేరుతో దూషించి దళిత విలేకరులపై దాడి చేసివ వారిని శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరశురాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం బుగ్గ బావిగూడెం సమీపంలో సర్వేనెంబర్ 652లో కేటాయించిన భూమిలో నివాస యోగ్యంగా మార్చుకుంటుండగా స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు దాడి చేయడం సరైనది కాదన్నారు. సమాజంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేసే జర్నలిస్టుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. విలేకరులుగా పనిచేసే వారందరూ వెనుకబడిన వర్గాల వారని, వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వ అనుమతితో పని చేసుకుంటున్న విలేకరులపై దాడి చేసిన వారిని శిక్షించాలని, కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా జంగయ్య

నవతెలంగాణ-నకిరేకల్



మండలంలోని నోముల గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షులుగా గుండగొని జంగయ్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొప్పు వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శిగా రాచకొండ హుస్సేన్‌గౌడ్, సభ్యులుగా భూపతి సైదులుగౌడ్, నర్సింగ్ సైదులుగౌడ్, యలమకంటి రాములుగౌడ్, కొక్కుల నాగరాజుగౌడ్, రాచకొండ నాగేంద్రబాబుగౌడ్, యరకల రాజుగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుండ గొని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ నుండి వచ్చే పథకాలను గీత కార్మికులందరికీ తెలియజేసి వారికి లబ్ధి చేకూరేలా పనిచేస్తానని పేర్కొన్నారు.

రోడ్లను బాగు చేసేదెప్పుడో..!

- మునుగోడు ఉప ఎన్నికలవేళ, హామీల వర్షం...
- నేటికీ అమలుకు నోచుకోని హామీలు..

నవతెలంగాణ-చండూర్



మునుగోడు ఉప ఎన్నికల ముందు లింకు రోడ్లను బాగు చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు ఆ రోడ్లను బాగు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు విమర్శలు కురిపిస్తున్నారు. చండూరులో ప్రధాన రహదారి గుంతలు గుంతలుగా ఏర్పడి అస్తవ్యస్తంగా ఉంది. పడమటి తాళ్ల గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడింది. చండూరుకు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. ఆ రోడ్డు ఇప్పటికి మట్టిరోడు గానే ఉన్నాయి. ఆ రోడ్డు గుండా చండూరుకు నిత్యం విద్యార్థులు, గ్రామస్తులు ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు అంతా గుంత గుంతలుగా ఉండడంతో ఏక్కడ కింద పడతామో అన్నట్టుగా జంకుతున్నారు. బంధువులు సైతం రావాలంటే భయపడుతున్నారు. ఒక ఊరు నుండి పడమటి తలా గ్రామానికి వచ్చిన బంధువు ద్విచక్ర వాహనం నుండి జారి కింద పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో రోడ్డుని మార్చుతామని, గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని గొప్పలు చెప్పారు తప్ప అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. పుల్లెంల నుండి తాస్కానిగూడెం రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది. బోడంగిపర్తి, నేర్మట గ్రామాల లింకు రోడ్లను బాగు చేస్తామని చెప్పి ఇంతవరకు చేయకపోవడంతో ప్రజలలో విమర్శలు లేకపోలేదు. తుమ్మలపల్లి నుండి గుండ్రపల్లి రోడ్డు కూడా ఇంతవరకు బాగు చేయలేదు. చండూరు మున్సిపల్ కేంద్రంలో ప్రధాన రహదారిపై బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. చండూరు నుండి బంగారిగడ్డలో బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. అటు బీటీ రోడ్డు, ఇటు లింకు రోడ్లు ఇంతవరకు బాగు చేయకపోవడంతో వాహనదారులు ఈ రోడ్డు వెంట నడవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు, మోకాళ్ళ లోతు గుంతలు, కంకర రాళ్లు తేలి ఉండడంతో ప్రమాదానికి గురవుతున్నారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి, బీటీ రోడ్లను, మట్టి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గతంలో రోడ్డు మరమ్మతుల పనులు చేపడతామని, ప్రజా ప్రతినిధులు, అధికారులుహామీలు ఇచ్చి పనులు చేపట్టకపోవడం శోచనీయం.

ఇబ్బందులు పడుతున్నాం..

సోము మల్లేష్ (పడమటి తాళ్ల గ్రామం స్థానికుడు)



మునుగోడు ఉప ఎన్నికల్లో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. మా గ్రామం నుండి చండూర్‌కి వెళ్లాలంటే మట్టి రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు వచ్చినప్పుడు, రాత్రి వేళల్లో గ్రామంలో ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చండూర్‌కి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. గ్రామాని ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మా గ్రామంలోకి వస్తే వారిని అడ్డుకుంటాం.

హామీలను వెంటనే అమలు చేయాలి

జేర్రిపోతుల ధనుంజయ గౌడ్(సీపీఐ(ఎం)చండూరు మండల సహాయ కార్యదర్శి)



మునుగోడు ఉప ఎన్నికల ముందు చండూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో లింకు రోడ్లను బాగు చేస్తామని చెప్పి ఇంతవరకు బాగు చేయలేదు. మట్టి రోడ్డు వెంట వెళ్లాలంటేవాహనదారులు, రైతులు,ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిలింకు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

నేడు మణిపూర్ హింసకాండపై నిరసన సభ

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

మణిపూర్‌లో మహిళలపై ఆకృత్యాలు, హింసకాండపై నేడు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 10 గంటలకు నిరసన సభను నిర్వహిస్తున్నట్లు మణిపూర్, కుకి మహిళలపై ఆకృత్యాల వ్యతిరేక కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షునిగా వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-హాలియా



టీయుడబ్ల్యూజే (ఐజేయు) నాగార్జున సాగర్ నియోజకవర్గ అధ్యక్షునిగా హాలియా చెందిన వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి నియామితులయ్యారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన్ని నియమించారు. ఈ సందర్భంగా వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శిగా పిట్టల సైదులు, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా పేలపూడి బాలకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శిగా దాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా సముద్రాల దామోదర్, దోసకాయల లింగయ్య, కార్యదర్శులుగా బత్తుల సూరయ్య, చిత్రం ప్రసాద్, బచ్చలకూరి వెంకన్న, కోశాధికారిగా ఎస్‌కే.మౌలానా, కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ మియా, ఉమ్మడి వెంకట్‌రెడ్డి, చాపల నరేందర్, నరసింహ, సైదులు, అప్పారావు, యోబు రాజులు నియమితులయ్యారు.

ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 ఎస్ఎస్సి బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల క్లాస్ మేట్ జిట్ట సంజీవ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఆదివారం 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మరో క్లాస్ మేట్ కొసనం యాదగిరి అనారోగ్యం బారిన పడడంతో చికిత్స నిమిత్తం 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరుకుల్ల శ్రీనివాస్, మెండే వెంకన్న, చోల్లేటి ఓంప్రకాష్, మిట్టపల్లి కృష్ణ, సామ వెంకటరెడ్డి, సిలివేరు నర్సింహ, కోనేటి కృష్ణ పాల్గొన్నారు.

ఆరుంధతం అరసమ్మరం
నవతెలంగాణ
సూర్యాపేట
3
సోమవారం 14 ఆగస్టు 2023



కొనసాగుతున్న జైపాల్‌రెడ్డి పాదయాత్ర

నసవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని గ్రామ గ్రామానికి స్వాముల జైపాల్‌రెడ్డి పాదయాత్ర కొనసాగుతూనే ఉంది. ఆదివారం మండల పరిధిలోని గుడిబండ, కాపుగల్లు, తొగర్రాయి, బిక్యాతండా, రామలక్ష్మీపురం గ్రామాలలో సాములు జైపాల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ సాముల జైపాల్‌రెడ్డి నిర్వహిస్తూ ఆయన మాట్లాడారు. కాపుగల్లు గ్రామంలో యువకులకు వాలీబాల్ నెట్ బహూకరించారు. అనంతరం చిలుకూరు మండలంలో పాదయాత్ర నిర్వహిస్తానని తెలిపారు. ఆయన వెంట కొప్పుల కోటిరెడ్డి, ఆయా గ్రామాల గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ -తుంగతుర్తి

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ సమీకృత భవనం, ఎస్పీ కార్యాలయం,మెడికల్ కళాశాల,ఇంటిగ్రేటెడ్ మార్కెట్,బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఈ నెల 20 న ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్నారని బీఆర్ఎస్వి తుంగతుర్తి మండల అధ్యక్షులు రచ్చ నవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంతో పాటు జిల్లాల అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని, పట్టణ,పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చారని పేర్కొన్నారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం..

- **100 పడకలు ఆసుపత్రిని ఇచ్చిన నేత...**
- **అపజయాలను గెలిచిననేత..**
- **యువతకు స్ఫూర్తి ఆ నేత...**
- **జననేత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు**



నవతెలంగాణ-కోదాడరూరల్

నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఎన్నో అపజయాలను చవిచూసి ఆ అపజయాలను గెలిచిన నేత మల్లన్న... నియోజకవర్గ ప్రజల కల వంద పడకల ఆస్పత్రి కోసం ఎంతో కృషి చేసి కెసిఆర్ దృష్టికి తీసుకుని వెళ్లి సాధించిన నేత మన మల్లన్న... పట్టణంలో 33 కేవీ విద్యుత్ లైన్ ను మార్చిన నేత మన మల్లన్న.. అన్నా అంటే నేనున్నాను అంటూ పేద ధనిక తేడా లేకుండ అందరి మంచి చెడు కార్యక్రమాలకు వచ్చేది మన మల్లన్న... కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అనేక కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను సామాన్యులకు అందించిన ఘనత మల్లన్నది. మున్సిపాలిటీ పరిధిని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత వార్డులలో సమస్యలు పరిష్కరించిన ఘనత మన మల్లన్నది. నేడు ఎమ్మెల్యే జన్మదినం మల్లయ్య యాదవ్ జన్మదినం సందర్భంగా జననేతకు నియోజకవర్గ ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు.

బడుగు బలహీన వర్గాల నేత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

కోట మధు (వార్డు కౌన్సిలర్)



బడుగు బలహీన వర్గాల నేత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆయురారోగ్యాలతో జీవిస్తూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బోనాల పండుగకు పోటెత్తిన జనం

- **అమ్మవారికి నైవేద్యం పెట్టిన భక్తులు**
- **దర్శనం కోసం బారులు తీరిన ప్రజలు**
- **హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు**
- **పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు దామోదర్ రెడ్డి,రమేష్ రెడ్డి**

నవ తెలంగాణ-సూర్యాపేట

జిల్లా కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల పండుగ కు జనం పోటెత్తారు.ఆదివారం పట్టణంలోని కృష్ణ టాకీస్, కోట మైసమ్మ,16 వ వార్డులో దేవాలయాలతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల్లో, మండల కేంద్రాల్లో బోనాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా పట్టణంలోని కృష్ణ టాకీస్ వద్ద గల ముత్యాలమ్మ బజార్ లో గల ముత్యాలమ్మ దేవాలయానికి భక్తులు ఉదయం నుంచే అమ్మ వారి దర్శనం కోసం బారులు తీరారు. అమ్మ వారి గుడి చుట్టూ మహిళలు ప్రదర్శనలు చేసి నైవేద్యం పెట్టి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి దంపతులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. ముత్యాలమ్మ తల్లి అందరిని చల్లగా చూడాలని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ పండుగలకు ప్రాధాన్యత ఇస్తూ వాటి అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నారని వివరించారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్,జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక,మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, కౌన్సిలర్స్ ఆకుల కవిత లవకుశ,సౌమ్య జానీ తదితరులు లు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



సూర్యాపేట

ముత్యాలమ్మ బోనాల పండుగ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ అమ్మవారి దీవెనలు జిల్లా ప్రజలందరిపై వుండాలని అన్నారు. రాబోయే కాలంలో ప్రజలందరిని చల్లగా చూడాలని ముత్యాలమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.

సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుందాం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి

పూర ముత్యాలమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ తల్లి దీవెనలు పట్టణ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు.



తుంగతుర్తి

దేవాలయం చుట్టూ పక్కల ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా ట్రాఫిక్ను నియంత్రించారు. ఉదయం నుండి రాత్రి వరకు భక్తులు దేవాలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

తుంగతుర్తి : తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు కేసీఆర్ పాలనలో ప్రత్యేక స్థానం ఏర్పాటయ్యిందని ఎంపీపీ గుండగాని కవితా రాములు గౌడ్ అన్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపీటీసీలు ఆయా గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముత్యాలమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి జెడ్పిటిసి కందాల దామోదర్ రెడ్డి ,పీఎసిఎస్ చైర్మన్, కనకటి వెంకన్న, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చూడి లింగారెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు ,ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు .



నూతనకల్

చివ్వేంల : సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రతిరూపాలైన గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మలకు బోనాలు నివేదించారు.

వ్యవసాయ కళాశాల పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

- **సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లాలో వ్యవసాయ రంగం, దాని అనుబంధ రంగాలైనటువంటి ఉద్యానవన , పశుసంపద , డైరీ , మత్స్య తత్సంబంధమైన అభివృద్ధి చెందాలంటే తప్పకుండా వ్యవసాయి కళాశాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ కళాశాలపరిశోధన స్థానం కోసం దాదాపుగా 200 నుండి 250 ఎకరాలు ఖాళీగా ఉన్నటువంటి , నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతంలో స్థాపించవలసిన అవసరముందని పేర్కొన్నారు. శరవేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు , మనుషుల దైనందిన ఆహారపు అలవాట్ల శైలి , వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులు వాటి పరిష్కారం కోసం జిల్లాలో వ్యవసాయ పరిశోధన స్థానం ను ఏర్పాటు చేసి వేగవంతం చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా వివిధ జిల్లాలు వివిధ రాష్ట్రాలు ద్వారా విద్యార్థులు ఇక్కడ ఏర్పాటు చేసిన నూతన వ్యవసాయ కళాశాలలో అడ్మిషన్ పొంది ఇక్కడి సామాజిక , ఆర్థిక , వాతావరణం స్థితిగతుల పై అవగాహన పొందుతారని వివరించారు. వ్యవసాయ పరిశోధనా మండలి వారి సౌజన్యంతో వివిధ ప్రాజెక్ట్ లను పొంది పంటలు , గ్రామాల్లో సర్వేలను చేసి యువత , మహిళల , రైతుసోదరులకు ఆర్థికలాభం చేకూరే విధంగా తొడప్పడుతారని తెలిపారు.

పనులను పరిశీలించిన సర్పంచ్

నవతెలంగాణ-మఠంపల్లి

మండలకేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. దళితులు స్మశానవాటిక రహదారిపనులు, కాల్వ మరమ్మత్తు పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఇరుగు పిచ్చయ్య, గ్రేగోల్డ్ సిమెంట్స్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, జగదేష్, గ్రామపంచాయతీ కో ఆప్షన్ నెంబర్ సురేష్‌గౌడ్, వార్డు నెంబర్లు సాయిలు, ఆంతోనిలు, మిరియాల పుల్లారెడ్డి, కందుల మోష, కందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మఠంపల్లి

స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శీను అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో స్కూల్ స్వీపర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ బేసిక్ స్వీపర్లను పర్మినెంట్ చేయాలని జీవో ప్రకారం వారికి కనీస వేతనం 15,500 ఇవ్వాలని, 30 సంవత్సరాల నుండి స్కూల్లో స్వీపర్లుగా పనిచేస్తున్న వారి న్యాయమైన కోరికలను తక్షణమే పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్, రనిమియా స్వీపర్ మండల అధ్యక్షురాలు కుమారి, స్వీపర్ మండల కార్యదర్శి లాల్ సాహెబ్, మీరుల గురువయ్య, ఉపాధ్యక్షుడు భవాని, సాలమ్మ, ముక్కోటి, సిహెచ్.వెంకటేశ్వర్లు, యశోద తదితరులు పాల్గొన్నారు.

రజాకారులకు ఎదురెల్లి పోరాడిన యోధుడు బీఎన్.రెడ్డి

నవతెలంగాణ-నాగారం

రజాకార్లకు ఎదురెల్లి పోరాడిన యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి అని బీఎన్ కూతురు రాజేశ్వరి దేవి అన్నారు. ఆదివారం నాగారం మండల పరిధిలోని ప్రగతినగర్ ఎస్సారెస్పీ కాలువ వద్ద బీఎన్ స్మృతి వనం ఏర్పాటు ఆత్మీయ సమ్మేళన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్సారెస్పీ కాలువకు బీఎన్.రెడ్డి పేరు పెట్టాలని ఆయన పేరు మీద గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సార్ ఎస్పీ జలాలను ఈ ప్రాంతానికి తేవడానికి మొట్టమొదట ప్రతిపాదించిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎం స్మరక కమిటీ అధ్యక్షులు కొత్తగట్టు మల్లయ్య, మల్లు కపోతంరెడ్డి, తాటికొండ సీతయ్య, తన్నీరు రాంబాబు, వీర పాపయ్య, సోమిరెడ్డి, యాదగిరి, కడెం మల్లయ్య, సుందర్ రావు, బిక్షం, కరుణ, రహిమాన్, సైదులు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ తిరగబడి యువకుడు మృతి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

బుదద పొలం దున్నుతున్న ట్రాక్టర్ వెనకకు తిరగబడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని దోనియాళ్ళ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండాల శ్రీను వయసు (25) గత పోయిన సంవత్సరం ట్రాక్టర్ కొనుక్కొని వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఆదివారం తన పొలంలో వరి నాటు వేసేందుకు కోసం ట్రాక్టర్‌తో దున్నుతుండగా మధ్యాహ్నం సమయంలో ట్రాక్టర్ ఒక్కసారిగా పొలంలో దిగబడిపోవడంతో ట్రాక్టర్‌ను బయటికి తీసేందుకు ట్రాక్టర్ నాగండ్లు విడదీసి ట్రాక్టర్‌ని బయటికి తీసే సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ వెనకకు తిరగబడడంతో ట్రాక్టర్‌పైన ఉన్న శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, రెండు సంవత్సరాలలోపు కవల పిల్లలు బాబు, పాప ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై వీరబాబు సంఘటన స్థలానికి వచ్చి వివరాలను అడిగి తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ప్రజలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్'

నవతెలంగాణ-తిరుమలగిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడానికి సాధ్యం కాని పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఐఎంఎల్ రామచంద్రన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుద్ధ సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం మున్సిపల్ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు మార్లు సాధ్యం కానీ బూటక వాగ్దానాలతో అధికారంలో వచ్చి ఒక్క హామీని అమలు చేయక పోగా ప్రజలను మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మూడోసారి అధికారం చేపట్టాలని ఉద్దేశంతో దళిత బంధు, బీసీ బంధు మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను అమలు చేస్తూ ఎన్నికల్లో గెలవడానికి మరో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు కేసీఆర్ మోసాల కు మోసపోకుండా రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు.



సర్దార్ సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ- మోతే

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్గూరి గోవిందు మడ్డి అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రాఘవపురం గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న 373 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపన్న 370 వ జయంతి ఉత్సవాలు ఈ నెల 18వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 18 న సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌లో నిర్వహించే బహిరంగ సభకు కల్లుగీత కార్మిక సంఘం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బ గాని బిక్షం జెర్రిపోతుల కృష్ణయ్య జిల్లా సహాయ కార్యదర్శి తండు రమేష్ మండల కార్యదర్శి బట్టి పెల్లి నాగ మల్లయ్య నాయకులు దూశర్ల ప్రకాశం, బత్తిని బుచ్చయ్య, దుశర్ల సత్యనారాయణ ,జలగం తిరుపతయ్య, బూడిద లింగయ్య, బత్తిని రాములు, బత్తిని కృష్ణయ్య ,కారింగుల జానయ్య, కోల లింగయ్య, బత్తిని మల్లయ్య ,తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బీసీ రుణాలివ్వడం సరికాదు

నవతెలంగాణ-అనంతగిరి

అర్హులైన పేదలకు బీసీ రుణాలు అందించకుండా పార్టీ వర్గీయులకు రుణాలు అందించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మండలంలో అన్ని గ్రామాల గ్రామసభల ద్వారా అర్హులైన పేదలను పార్టీలకు అతీతంగా ఎంపిక చెయ్యకుండా అధికార పార్టీకి చెందిన బీసీలకు మాత్రమే బీసీ బందు పథకానికి ఎంపిక చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయం జోక్యం లేకుండా అర్హులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేసి అందించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు.



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి

నవతెలంగాణ-నకిరేకల్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వహక కార్యదర్శి దైద రవీందర్ కోరారు. ఆదివారం ఉదయం స్థానిక మినీ స్టేడియంలో స్థానికులతో మార్నింగ్ వాక్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ హామీలు ప్రగతికి సోపానాలు కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్యారెంటీగా అమలు చేసే పథకాల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఆయన వెంట మాజీ సింగిల్ విండో చైర్మెన్ గార్లపాటి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొబ్బల నరసింహారెడ్డి, ఎండీ.యూసుఫ్, అబ్దుల్ మజీద్, వంటెపాక నక్షత్, పందిరి సతీష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **ఆర్యవైశ్య సాధనసమితి నాయకులు కక్కిరేని శ్రీనివాస్, కర్నాటి కిషన్**
- **వేలాదిమందితో భారీ బైక్ ర్యాలీ**
- **జెండా ఊపి ప్రారంభించిన ప్రముఖ వ్యాపారవేత్త మీలా మహాదేవ్**

నవతెలంగాణ-సూర్యాపేట

ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన సమితి నిర్వాహకులు కక్కిరేణి శ్రీనివాస్, కర్నాటి కిషన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ లో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎలక్షన్ మేనిఫెస్టోలో ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని చెప్పి ఇంతవరకు ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. ఈ ఎన్నికల ముందైనా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి లకు విన్నవిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అతి పేద ఆర్యవైశ్యులకు న్యాయం జరిగేలా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో మంత్రి జగదీష్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ భవనానికి స్థలం ఇస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అదే విధంగా కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి, కేసీ గుప్తా విగ్రహాలకు పూలమాలు వేసి తిరిగి గాంధీ విగ్రహం వద్ద ఈ ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సాధనసమితి నాయకులు కోటగిరి రాధాకృష్ణ, బొమ్మిడి లక్ష్మీనారాయణ, కలకోట లక్ష్మయ్య, బెలిదే శ్రీనివాస్, దేవరశెట్టి సత్యనారాయణ, వెంపటి శబరీనాథ్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్తా, ఈగ వెంకటేశ్వర్లు, మాడ్గుల నవీన్ కుమార్, బజ్జూరి శ్రీనివాస్, వీరవెల్లి విజయ్ ,ఆర్యవైశ్య జర్నలిస్టులు తల్లాడ చందన్, కొండ్లె కృష్ణయ్య పెనుగొండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.





వ్యక్తిపై గొడ్డలితో దాడి

నవతెలంగాణ- తుంగతుర్తి

భూ తగాదాల విషయంలో వ్యక్తిపై ముగ్గురు కలిసి దాడి చేసిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని బండరామారం గ్రామంలో చోటుచేసుకుంది. బంధుమిత్రులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బండరామారం గ్రామానికి చెందిన ఉప్పుల ఎల్లయ్యపై భూ తగాదాల విషయంలో అదే గ్రామానికి చెందిన కొల్లూరు సోమనసయ్య, లింగయ్య, రాజు కలిసి గొడ్డలితో దాడి చేశారు. దీంతో ఎల్లయ్యకు తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు ఉత్తంకుమార్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని టీడీపీ నల్లగొండ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు గౌడ్ ఆరోపించారు. ఆదివారం స్థానికంగా నిర్వమించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రజలు వీళ్లకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓయ్ లాంచర్లు అవినీతికి పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు నియోజకవర్గంలో జరుగుతున్న పలు విషయాలను సమస్యలను గమనిస్తున్నారన్నారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ -పెదపూర

మండలంలోని రామన్నగూడెం తండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ నరేష్ నాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రామన్నగూడెం తండా, ఎనిమిది తుమ్మ చెట్టు తండాలు కలిపి రమన్నాగూడెం తండ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గతంలో పెద్ద ఎత్తున ప్రజలు నిరసనలు కూడా తెలిపారన్నారు. ఇప్పటికైనా గిరిజన ప్రజల ఆవేదనను పరిగణలో తీసుకొని నూతన గ్రామపంచాయతీగా రామన్నగూడెం తండ గ్రామాన్ని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామావత్ మాలిక్, రమావత్ హరికృష్ణ, రమావత్ హరి ప్రసాద్, బాల్సిక్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

నవతెలంగాణ-నాగారం

తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అద్దంకి దయాకర్‌గా వాట్సాప్‌లో వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్ తెలిపారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఆడుతున్న రాజకీయ క్రీడలో భాగంగా వాట్సాప్ అసత్య ప్రచారమే తప్ప కేంద్ర కాంగ్రెస్ పార్టీ సర్వే చేసి ప్రజా అభిప్రాయం మేరకే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తుందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ముడుంబా జాహ్నవికి అభినందన

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన విద్యార్థి ముడుంబా జాహ్నవి 2023 సంవత్సరం ఎస్ఎస్సీ పరీక్షలు 10/10 మార్కులు సాధించినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి, నీటిపారుదలశాఖ చైర్మెన్ సముద్రాల వేణుగోపాలచారి ఆదివారం హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తమ లక్ష్యాలను సాధించాలని వారు తెలిపారు.

17, 18 న పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి వర్క్ షాప్

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఈనెల 17, 18 వ తేదీల్లో హైదరాబాదులోనే విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్టు పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఎం.చందర్‌రావు తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్లు హ రగోపాల్ ఖాసీం డాక్టర్ కోయా కోటేశ్వరరావు హాజరవుతారన్నారు హాజరవుతారని, ఈ వర్క్ షాప్‌లో ఆర్థిక సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చ, విద్యారంగ సమస్యలపై తీసుకోవాల్సిన నిర్ణయం గురించి తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భాను, జగదీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-నాగార్జునసాగర్

పైలాన్ కాలనీలోని తెలంగాణ ఆంధ్ర బార్డర్ చెక్ పోస్ట్ వద్ద నాగార్జునసాగర్ ఎస్ఐ సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో వాహనాలు తనికి చేస్తుండగా గత శనివారం సాయంత్రం షేక్ మీర్జావలి (21), షేక్ యూసుఫ్ (35) ఇద్దరు వ్యక్తుల వద్ద 160 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఆదివారం స్థానిక విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో సాగర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బీసన్న వివరాలు వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్, పోలీస్ సిబ్బందితో కలిసి ఆంధ్ర తెలంగాణ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా శనివారం సాయంత్రం సుమారు మూడు గంటల 15 నిమిషాలకు మిర్యాలగూడకు చెందిన షేక్ మీర్జావలి, షేక్ యూసుఫ్ మాచర్ల నుండి టూవీలర్ వాహనంపై మిర్యాలగూడకు వెళ్తున్న క్రమంలో చెక్‌పోస్ట్ వద్దకు రాగానే ఆ వాహనాన్ని ఆపి బైక్ పై గల ఇద్దరు వ్యక్తులను విచారించగా 160 గ్రాముల గంజాయిని తీసుకెళ్తున్నట్లు తెలిపారని గత కొంత కాలంగా గంజాయి తాగే అలవాటు ఉన్నదని అందుకుగాను మాచర్ల కి వెళ్లి అక్కడ బస్టాండ్ ఏరియాలో ఒక గుర్తు తెలియని వ్యక్తి దగ్గర 160 గ్రాముల గంజాయిని 3 వేల రూపాయలకు కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని బైక్ సీట్ కింద పెట్టి తరలిస్తున్నట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. గంజాయి నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన విజయపురి టౌన్ ఎస్సై సంపత్‌గౌడ్, సిబ్బందిని సీఐ బిసన్న ప్రత్యేకంగా అభినందించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని నాగార్జునసాగర్ సర్కిల్ సిఐ బిసన్న అన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని సోలిపేట గ్రామంలో స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉప్పల రాములు జ్ఞాపకార్థం శ్రీ వెంకటేశ్వర ఆగ్రో రైస్ మిల్ చైర్మెన్ వారి కుమారులు ఉప్పల వినోద్ కుమార్ క్రికెట్ సోలిపేట ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. ఈ లీగ్ లో మొదటి బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి 2500 , షీల్డ్‌ను గెలుపొందిన యువకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోలిపేట గ్రామ సర్పంచ్ నవీన్ గౌడ్, వార్డ్ మెంబర్ రాజు, సురేష్, రవీందర్ రెడ్డి బాలకృష్ణ, పరమేష్, శర్మ, నవీన్, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- భువనగిరి రూరల్

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులకు 2023-24 సంవత్సరానికి గాను విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా దరఖాస్తులను నేటి నుంచి 30-09-2023 తేది వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి ఎం జయపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. విద్యార్థులు telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



- పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లనే పంచని ప్రభుత్వం

పదేండ్ల నుండి పేదలకు సొంతిల్లు కలగానే మిగిలిపోయింది.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం పదేండ్లలో పూర్తిగా ఎక్కడా కూడా పంపిణీ చేయలేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం మళ్లీ గృహలక్ష్మి పథకాన్ని ముందుకు తీసుకొచ్చింది. ఈ పథకంలోనైనా తమ సొంతింటికల నెరువేరుతుందా..అని పేదలు ఎదురుచూస్తున్నారు.

సొంతింటి కల నెరవేరేనా..!

నవతెలంగాణ- సంస్థాన్ నారాయణపురం

పదేండ్ల నుండి పేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. గృహ నిర్మాణ శాఖ ద్వారా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇండ్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని,పేదలకు డబ్బా ఇండ్లు కాదు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావాలని, ఇండ్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని 2014 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హామీ ఇచ్చింది.అమలు పరిచేకాడా పూర్తిగా విఫలం చెందింది. ప్రభుత్వం అనువైన స్థలాలు దొరకడం లేదని, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని సాకులు చెప్పింది. తిరిగి అదే బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఎన్నికల్లో ఇండ్ల నిర్మాణాలకు స్థలం దొరకడం లేదని, సొంతింటి జాగా ఉన్నవారికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పింది.నిధులు లేని కారణంగా రెండోసారి ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేకపోయింది. సాధారణ ఎన్నికల సమీపిస్తుండడంతో సొంత స్థలాలోనే ఇండ్లు నిర్మాణం చేసుకునేందుకు రూ.3 లక్షలు ఇస్తామని నూతనంగా గృహ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది.అందుకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంతో పదేండ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఈసారి అయినా ప్రభుత్వ హామీ అమలయ్యేనా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గం లో నారాయణపురం, చౌటుప్పల్, మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడెం మండలాలు ఉండగా 2014 ఎన్నికల హామీల్లో భాగంగా చౌటుప్పల్‌లోని సర్వేనెంబర్ 113 లో సుమారు 150 కి పైగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేసేందుకు 2016లో ఎమ్మెల్యే కోసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.గతంలో ఇది పేదలకు ఇండ్ల స్థలాల కోసం పంపిణీ చేసిన స్థలం కావడంతో లబ్ధిదారులు ఆందోళనకు చేశారు. వెనక్కి తగ్గిన అధికారులు తిరిగి దండు మల్కాపురంలో 2017 జూలై లో 70 ఇండ్ల నిర్మాణాలకు, సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలోని సర్వేనెం.1 లో 60 నుంచి 70 ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు మంత్రి జగదీశ్ రెడ్డి చేతుల మీదగా శంకుస్థాపన చేశారు.నిర్మాణాలు పూర్తయి ఐదేండ్లు అయినా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. అనంతరం నారాయణపురం మండల కేంద్రంలో 120 ఇండ్లు, మునుగోడు మండలంలో నిర్మాణం చేసేందుకు పనులు ప్రారంభించినప్పటికీ బేస్మెంట్ లెవెల్ లోనే ఆగిపోయి ఉన్నాయి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి అయినచోట నాసిరకంగా పనులు చేపట్టడంతో పంపిణీకి చేయకముందే ఇండ్లు పాడైపోతున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన దండు మల్కాపురం,సర్వేలు గ్రామాల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి.గత హామీలను అమలు చేయని ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు న్యాయం చేసేనా?అని ఎవరికి వారే ప్రశ్నించుకుంటున్నారు.



వాగులపై హైలెవెల్ బ్రిడ్జీలను నిర్మించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

నవతెలంగాణ -ఆత్మకూర్ ఎం

మండలంలోనికూరెళ్ళ, రాఘవాపురం గ్రామాల మధ్య ఉన్న భీమలింగం, ఆత్మకూర్, మొరిపిరాల, కొరటికల్ గ్రామాల మధ్య ఉన్న బిక్కేర్ వాగులపై ప్రభుత్వం వెంటనే హైలెవెల్ బ్రిడ్జీలను నిర్మించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ సభ్యులతో కలిసి మండలంలోని కూరెళ్ళ, రాఘవపురం గ్రామాల మధ్య ఉన్న భీమలింగం వాగుపై ఉన్న బ్రిడ్జిని ఆదివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమలింగం కాల్వ పై ఉన్న బ్రిడ్జి పురాతనమైన బ్రిడ్జి కావడంతో భారీ వర్షాలకు పూర్తిగా ధంసమైందన్నారు. మండలంలోని పలు వాగులపై నాటి ప్రభుత్వాలు తక్కువ ఎత్తులో బ్రిడ్జిలు నిర్ధయించడంతో జూలైలో కురిసిన భారీ వర్షాలకు సుమారుగా 10 రోజులు కూరెళ్ళ, రాఘవాపురంగ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలోపెట్టుకొనివాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కురిసిన భారీ వర్షాలకు బిక్కేరు వాగుపై ఉన్న బ్రిడ్జిలు తక్కువ ఎత్తు ఉండడంతోమండల కేంద్రానికి రావడానికి మొరిపిరాల, కొరటికల్ గ్రామాల పరిసర ప్రాంతాల ప్రజలు సుమారుగా ఐదు రోజులు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మండలంపై ప్రత్యేక దృష్టి సారించి వాగులపై వెంటనే హైలెవెల్ బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని కోరారు. మండలంలోని వాగులపై వెంటనే హైలెవెల్ బ్రిడ్జిలను నిర్మించకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం, మండల కమిటీ సభ్యులు భాషబోయిన బుగ్గయ్య, నాయకులు బండ బీరయ్య, అవనగంటి సోమయ్య, భాషబోయిన ఐలయ్య, నార్కపల్లి ముత్తయ్య, బుర్ర రాములు, ఉప్పల నరసయ్య, కన్నబోయిన ఐలయ్య, బుర్ర వీరమ్మ, సుధగాని కమల్, వడ్లకొండ రితీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



- బీఆర్ఎస్‌పార్టీ నాయకులు కూసుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్

విద్యార్థులు, యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కూసుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు లింగారెడ్డిగూడెం, 2వ వార్డు తాళ్లసింగారం, 3వ వార్డు లింగోజిగూడెం గ్రామాల్లోని యువతకు, విద్యార్థులకు క్రీడాసామాగ్రి, క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడ్తా యన్నారు. స్నేహభావాన్ని పెంపొందిస్తా యన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడలు, చదువులో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు కొరగోని లింగస్వామి, బత్తుల రాజ్యలక్ష్మి, బండమీది మల్లేశం, యూత్ అధ్యక్షులు తొర్పునూరి నర్సింహగౌడ్, నాయకులు భీమిడి రాంరెడ్డి, తాడూరి పరమేశ్, సుర్కంటి నవీన్‌రెడ్డి, తొర్పునూరి వెంకటేశంగౌడ్, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుర్కంటి ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆరుట్ల లింగస్వామి, ఉష్కాగుల సురేశ్‌గౌడ్, బొంగు మల్లేశ్‌గౌడ్, వల్లందాసు సతీశ్, బొంగు నాగేశ్, నల్ల గణేశ్, వెంకటేశ్, రఘు, శ్రీకాంత్, మల్లేశం, సుదర్శన్, శేఖర్ పాల్గొన్నారు.



కాసోజు మల్లయ్యాచార్య సంకలన గ్రంథం వివాహ భట్టియం ఆవిష్కరణ

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామంలోని శుభం గార్డెన్స్ లో ఆదివారం విరాట్ సేన ఆధ్వర్యంలో కాసోజు మల్లయ్యాచార్య రచించిన సంకలన గ్రంథం వివాహ భట్టియం ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభా మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రావణ్‌ల చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు లాలుకోట వెంకటాచారి, కూరెళ్ల విఠలాచార్య, పులిగిల్ల రంగాచారి, రామడుగు నర్సింహాచారి, గుండోజు నాగార్జునచారి, కారంపూడి కృష్ణమూర్తి, రాచకొండ వేణుకుమారచార్యులు, చౌదరిమెట్టు శ్రీనివాస్, రాచకొండ భాస్కరాచార్యులు, కాసోజు శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

గ్రామాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

నవతెలంగాణ- భూదాన్ పోచంపల్లి



గ్రామాలను సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలో అంతమ్మ గూడెం గ్రామ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతం రోడ్డు సౌకర్యం లేక గ్రామపంచాయతీ లేక అంతమ్మ గూడెం ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన స్వరాష్ట్రంలో నూతన గ్రామ పంచాయతీగా అంతమ్మ గూడెం ఏర్పడిన ఐదేండ్లకాలంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. రోడ్డు సదుపాయం వార్డులలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధిలైట్లు ,మంచినీటి వసతి, కమ్యూనిటీ హాల్ సదుపాయం కల్పించామన్నారు .మారుమూల గ్రామం అయినా ఈ ప్రాంతానికి సుమారు రెండు కోట్లు నిధులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేశామన్నారు, ఎమ్మెల్యేను గ్రామ ప్రజలు మహిళా భవనం కురుమ సంఘం భవనాలకు నిధులు కేటాయించాలని కోరగానే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం రైతులు సాగునీరు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో తన సొంత నిధులు 15 లక్షల రూపాయలు ఇచ్చే పిలాయిపల్లి కాలువ ద్వారా అంతమ్మ గూడెం గ్రామ ప్రజలకు సాగునీరు అందిస్తామని చెప్పారు భీమనపల్లి జూబ్లక్పల్లి దోతి గూడెం గ్రామాలకు పిల్లాయిపల్లి కాలువ లిఫ్టు ద్వారా చెరువులు నింపి ఈ ప్రాంత రైతందానికి గతంలో బీడు భూములుగా ఉన్న నేడు సాగులోకి కొన్ని వేల ఎకరాలు వచ్చాయన్నారు. హాస్పిటల్ ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరగా ఎమ్మెల్యే తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జూబ్లక్ పల్లి..గ్రామంలో పశువైద్యశాల భవనం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాదుగుల ప్రభాకర్ రెడ్డి వైస్ ఎంపీపీ పాక వెంకటేశం సింగల్ విండో చైర్మన్ కందాల భూపాల్ రెడ్డి పిటిసిలు బత్తుల మా దేవి శ్రీశైలం రావుల శ్రీదేవి శేఖర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి జూబ్లక్పల్లి సర్పంచి చిన్న లచ్చి లింగస్వామి అంతమ్మ గూడెం సర్పంచ్ పావని మల్లేష మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి మున్సిపల్ వైస్ చైర్మన్ లింగస్వామి కౌన్సిలర్లు ఉపసర్పంచులు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేస్తూ గెజిట్ విడుదల చేయాలి



నవతెలంగాణ- ఆలేరుటౌన్

ఆలేరు రెవెన్యూ డివిజన్ గా మారుస్తూ గెజిట్ విడుదల చేయాలని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలతో ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు కోరారు. ఆలేరు పట్టణంలో ఆదివారం ఆ పార్టీఆధ్వర్యంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఆలేరు రెవెన్యూ డివిజన్ గా అభివృద్ధి చేస్తామని గత సాధారణ ఎన్నికలకు ముందు ఎన్నికల బహిరంగ సభలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆలేరు ప్రభుత్వాసుపత్రిని 100 పడకలతో ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని చెప్పారని, నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ, ఇప్పటివరకు హామీ నెరవేయడం లేదని అన్నారు. ఆలేరు పెద్దవాగుపై బ్రిడ్జిని వెడల్పు చేయకపోవడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైల్వే అండర్‌పాస్‌ను నిర్మించాలని కోరారు. పాత గ్రామపంచాయతీ స్థలంలోనే నూతన మున్సిపాలిటీ భవ నిర్మించాలని వెంటనే చెత్త డంపింగ్ యార్డ్ ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణంలో నిర్వహిస్తున్న రిలేనివాహన దీక్షల శిబిరాన్ని కొలనుపాక మాజీ సర్పంచ్ రైతు కూలీ సంఘం నాయకుడు మామిడాల సోమయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు గడ్డం నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ,సిపిఐ పట్టణ కార్యదర్శి గొట్టిపాముల రాజు హాజరై నిరాహార దీక్షలకు పూర్తి మద్దతులిస్తూ మాట్లాడారు. భవిష్యత్తులో ఈ సంవత్సర సాధన కోసం ఐక్య పోరాటాలు నిర్మించాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ , మండల నాయకులు జూకంటి పౌలు, మోరిగాడి రమేష్ , వడ్డేమాన్ విప్లవ్ , కాసుల నరేష్ ,చింతల నాగరాజు, చెన్న రాజేష్, బుగ్గ నవీన్ , కేతావత్ లక్ష్మి ,మాదాని నవీన్, చెక్క పరశురాములు, గొడుగు దాసు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో మాజీ చైర్మన్ మోరిగాడి చంద్రశేఖర్ , ఘనగాని మల్లేశం, సూద గాని సత్య రాజయ్య, శర్బనాపురం మాజీ సర్పంచ్ సూదగాని నరసమ్మ , నల్ల మాస తులసయ్య , మోరిగాడి లక్ష్మణ్ ,మోరిగాడి అశోక్, ఘనగాని కిష్టయ్య ,గణగాని రాజు ,సురేష్ నాయక్, గడ్డమీది యాదగిరి ,మిట్ట శంకరయ్య, గడ్డమీది బుచ్చమ్మ ,కూరాకుల మల్లికార్జున్ , బొమ్మ కంటి లక్ష్మీనారాయణ , రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి పథకం సాంక్షన్ కాఫీ అందజేసిన కలెక్టర్ ఎమ్మెల్యే

నవతెలంగాణ -భూధాన్ పోచంపల్లి

గృహలక్ష్మి పథకం సాంక్షన్ ఆర్డర్ కాపీ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి కనుముక్కల గ్రామానికచెందిన చుక్క పావని భర్త నరేష్ దివ్యాంగులు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి భువనగిరి శాసనసభ్యులు శేఖర్ రెడ్డి చేతుల మీద బాధితులకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్ ప్రారంభోత్సవానికిఐటీ శాఖ జౌళి శాఖ మంత్రి తారక రామారావు బాధితులు మొర పెట్టుకోగా వెంటనే గృహలక్ష్మి పథకం సాంక్షన్ చేసి ఇల్లు నిర్మించుకునేందుకు నిధులు విడుదల చేయాలని అధికారులకు సూచించారు ఆదివారం బాధితులకు అందజేశారు ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి ఇండ్లు లేని ప్రతి పేద కుటుంబానికి అర్హులైన వారికిఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మొదటి విడత లక్ష రూపాయలు, రెండో విడత లక్ష రూపాయలు మూడో విడత లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం పేదలకు అందజేస్తుందన్నారు.

ప్రజా సమస్యలపై14న ధర్నా

నవ తెలంగాణ- భువనగిరి



భువనగిరి పట్టణంలోని ప్రజా సమస్యలపై ఈ నెల14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ కోరారు. ఆదివారం పట్టణంలోనిడ్రెయినేజీ, సీసీ రోడ్లు రేషన్ కార్డులు పెన్షన్లు నిరుపేదలకు ఇండ్లు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని 25వ వార్డులో ఎల్బీనగర్‌లో ఆటో ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు తినడానికి తిండి ఉండడానికి ఇల్లు సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫ్లమైనాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, పట్టణ నాయకులు బందెలఎల్లయ్య, శాఖ కార్యదర్శి కోటగిరి వీరబ్రహ్మం, భూస కృష్ణ, వనం గిరి, ఆఫీస్ కార్యదర్శి వడ్డబోయిన వెంకటేష్, నీలం పెంటయ్య, నాగమణి, మల్లేష్ పాల్గొన్నారు.

రూ.5కోట్లతో కొలనుపాక అభివృద్ధి

నవతెలంగాణ- ఆలేరురూరల్

ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి రూ.5కోట్లతో కొలనుపాక గ్రామ అభివృద్ధి చేయడానికి కృషి చేశారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ అన్నారు .ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో ఏబిఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ చేసిందని పేర్కొన్నారు. రూ.30 లక్షల పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. గ్రామానికి ఎన్ఆర్‌జిఎస్ నిధులు పెండింగ్ ఉండడంతో అవి వెంటనే ఆరు రోడ్ల నిర్మాణ పనులకు 10 శాతం పర్సెంట్‌గా 50000 ఇచ్చారన్నారు. అన్ని గ్రామాల నుండి ఆలేరు శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్పు గొంగిడి సునీత మహేందర్ రెడ్డికి డీసీసీబీచైర్మెన్ మహేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బక్క రాంప్రసాద్ ,సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి ,మండల సెక్రెటరీ జనరల్ రచ్చ రామ నరసయ్య ,మండల వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ ,మాజీ ఎంపీపీ కాసగళ్ల అనసూయ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు భానుచందర్ ,మండల పార్టీ ఉపాధ్యక్షులు శోభన్ బాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగస్వామి, గ్రామ సర్పంచులు వంగాల శ్రీశైలం, కోటగిరి పండరి, మహేందర్ రెడ్డి వార్డు సభ్యులు జంగా పరశు రాములు, కాళి పిఎసిఎస్ డైరెక్టర్ మల్లేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు, నాయకులు దూసరి గణేష్ ,ఖాశెట్టి రాజు ,నంద మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలి



- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు

నవ తెలంగాణ-బొమ్మలరామారం

గ్రామ సభల ద్వారానే గృహలక్ష్మి పథకం లబ్దిదారులను ఎంపిక చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం ఆదివారం మైలారం లక్ష్మయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో పేదలకు సాగుభూమి ,ఇంటి స్థలాలు ఇచ్చిన దాలాలు లేవన్నారు. త్రిబుల్‌ఆర్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తున్నారన్నారు. గతంలో ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూములకు పట్టా సర్టిఫికెట్లు ఉన్నా కూడా భూమి అప్పగించకుండా రెవిన్యూ శాఖ పేదలను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ర్యకలశ్రీశైలం,ముక్కల పున్నమ్మ, సల్లూర్ కుమార్, గూదే ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టి9 టికెట్ ద్వారా రూ.30 వరకు ఆదా పొందండి

- డిపో మేనేజర్‌శ్రీనివాస్

భువనగిరి: తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన టి (9)టికెట్ ను తీసుకుని ప్రయాణికులు రూ.30 వరకు ఆదా చేసుకోవాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం బీబీనగర్ మండలం జూలూరు గ్రామం లో రజక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లె వెలుగు బస్‌లో 30 కి .మీ పరిధిలో ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు రానూ పోనూ సౌకర్యం కేవలం 50 రూపాయలకే అందిస్తున్నామన్నారు. ఎక్స్ ప్రెస్ బస్‌లో అదనంగా మరో రూ.20 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే వివాహది శుభకార్యాలకు ఆర్టీసీ బస్సుల బుకింగ్ లు, విద్యార్థుల, వికలాంగుల బస్ పాస్‌ల రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ , రజక సంఘం అధ్యక్షులు అయితరాజు భిక్షపతి , పంచాయతీ కార్యదర్శి వట్టిపల్లి నర్సింహా , గ్రామ విలేజ్ బస్ ఆఫీసర్ అశోక్ పాల్గొన్నారు.



పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య

నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్

ప్రజలకు సేవ చేయడమే తనలక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో ఆయన వాటర్ క్యాన్లు పంపిణీచేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే అర్హులైన పేదలందరికీ తెల్ల పేపర్ మీద దరఖాస్తు చేసుకుంటే ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి కింద మూడు లక్షలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ చీర శ్రీశైలం, సర్పంచ్ రాజ్యలక్ష్మి రామ్ చందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గిరి గౌడ్, వార్డు మెంబర్లు మచ్చేందర్, సుబ్బురు శ్రీనివాస్, గడ్డం రమేష్, ఎర్ర క్రాంతి, మాజీ ఎంపీటీసీ చంద సాయిబాబా, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుంభం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ -భువనగిరిరూరల్



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ దొనకొండ వనిత తో పాటు సుమారు 30 మంది మహిళ కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసే భువనగిరి జిల్లాపై గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ దొనకొండ వనిత, మహిళ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాజాపేట మండలాభివృద్ధికి నిధులు మంజూరు

నవతెలంగాణ -రాజాపేట

రాజాపేట మండలంలోని వివిధ గ్రామాలకు సీడీపీ ఫండ్ కింద 80 లక్షలు రూపాయల నిధులు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మంజూరు చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సందిల భాస్కర్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కోతులు ,కుక్కల స్వైర విహారం

చిన్నారులను వృద్ధులను మహిళలను వనికిస్తున్న కోతులు కుక్కలు

ఆందోళన చెందుతున్న ప్రజలు

నవ తెలంగాణ- ఆలేరు టౌన్

ఆలేరు పట్టణంలో రోజురోజుకు ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు ప్రజలను భయాందోళన గురి చేస్తున్నాయి. వృద్ధులను, మహిళలను, చిన్నారులను మీద పడి గాయాలు చేస్తున్నాయి. పట్టణంలోని భారత్ నగర్ , పోచమ్మ వీధి, సంతోష్ నగర్, కొలనుపాక రోడ్డు,రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్ వద్ద, కాటమయ్య నగర్ , చింతల బస్తి , ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కోతుల అధికంగా సంచరిస్తున్నాయి. పట్టణంలో ఇటీవల కాలంలో కోతుల సంతతి బాగా పెరిగింది. భరత్ నగర్ లో నారాయణ సిద్దులు ను కోతి కరవడంతో చికిత్స చేయించుకున్నాడు. పట్టణంలో కోతుల బాధితులు అనేక మంది ఉన్నారు. షాపులలో కొతుల బాధతో చుట్టూ ఇనుపకంచే వేసుకోవడం జరిగింది. లోకి చొరబడి పప్పు దినుసులు, ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్ల షాప్ లలో కోతులు ఎత్తుకెళ్తున్నాయి. రైల్వే స్టేషన్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైన మహిళలు పిల్లలు వృద్ధులు సామాను తేస్తుంటే గుంజుతున్నాయి. ఇళ్ల పరిసర ప్రాంతాల నుండి తరిమే ప్రయత్నం చేస్తే ఎదురు తిరుగుతున్నాయని , కోతులు తరుముతున్నాయని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు సంతోష్ నగర్, పోచమ్మ వీధి, రైల్వే గేట్, శ్రీ కనకదుర్గ ఆలయం, పెదవాగు రోడ్డు, క్రాంతి నగర్, బృందావన్ కాలనీ, శ్రీ రామకృష్ణ విద్యాలయం రోడ్, రెడ్డిగూడెం, ఫంక్షన్ హాల్ లో పరిసర ప్రాంతాలలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల పట్టణంలో తాను చాదుకునే కుక్కనే కుటుంబ సభ్యులను కరవడంతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు . రిబిస్ వ్యాధి వచ్చిన కుక్క కారణంగా ఇటీవల ఒక మహిళా మృత్యువాత పడింది. కుక్క కరిచిందని పరామర్శించడానికి వెళ్లిన ఇరుగు , పొరుగు వారు సైతం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల చేత ఎన్నిక కాబడిన పాలకులు, ప్రభుత్వ అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. రోజురోజుకు పెరుగుతున్న కోతుల కుక్కల సంతతిని చూసి ప్రజలు భయభ్రాంతులను చెందుతున్నారు. వాటిని పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. వీధి కుక్కలు , కోతుల నియంత్రణపై ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొతులను కుక్కల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలి

బెల్దే వెంకటయ్య

ఏర్పట్టణంలో కోతులను కుక్కల నిర్మూలనకు పురపాలక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. కొతులకు ,కుక్కలకు కుటుంబ నియంత్రణ చేపట్టాలి వాటిని పట్టుకొని అటవి ప్రాంతాలకు తరలించాలి. కోతులు పట్టణంలో స్వైర విహారం చేస్తున్నాయి.

కేసారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

నవ తెలంగాణ -భువనగిరి రూరల్



భువనగిరి మండలంలోని కెసారం గ్రామంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ ఆర్ కె హాస్పిటల్ ఆధ్వర్యంలో పల్లె పల్లకి వైద్యం కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కునూరు ఎంపీటీసీ పాశం శివానంద్, ఆ గ్రామ ఉప సర్పంచ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ చావా రాజ్ కుమార్ చాలా చిన్న వయసులో గొప్ప సంకల్పాన్ని ఏర్పరచుకొని 99 ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ బిపి, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాల సమస్యల వల్ల కలుగు నష్టాలను వాటిని నివారించుకునేందుకు తీసుకోవాల్సిన తగు చర్యలను పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతుల కృష్ణ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు కమ్మగాని నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుక్క రవీందర్,ప్రధాన కార్యదర్శిగా సంగెం నరసింహ, ఉపాధ్యక్షులుగా ఊదరి మహేందర్, సహయ కార్యదర్శిగా చిట్టెంపల్లి వంశీ,కోశాధికారిగా దౌడి శివ కుమార్‌లనుఎన్నుకున్నారు. గౌరవ సభ్యులుగా దండు మల్కాపురం ఎంపిటిసి చిట్టెంపల్లి శ్రీనివాసరావు,మీసాల నరసింహ,చిట్టెంపల్లి జంగయ్య,పల్లె భూపాల్,దుబ్బ శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఎన్నుకున్నానంతరం శాలువాలతో నూతన కమిటీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికుల అవస్థలు

పెండింగ్‌లో 12 నెలల బిల్లులు

నవ తెలంగాణ -ఆలేరు టౌన్



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 2022లో 6 నెలలు , 2023లో 6 నెలలు మొత్తంగా సంవత్సరం బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తల తాకట్టు పెట్టి మరి, కిరాణా షాపులలో, కూరగాయల షాపులలో, పండ్ల దుకాణాల వద్ద , సరుకుల అరువు తెచ్చి అప్పుల పాలవుతున్నారు. ఆలేరు పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో 500 మంది విద్యార్థులకు రోజుగా రోజువారీగా వండి పెడుతున్నారు. 500 మంది విద్యార్థులకు గాను సోమవారం, బుధవారం, శుక్రవారం, గుడ్డు పప్పు చారు వడ్డిస్తారు. మంగళవారం, గురువారం, శనివారం రోజులలో ఆకుకూరలు, పప్పు, దోసకాయ , వంకాయ, తో పాటు ఇతర అందుబాటులో ఉన్న కూరగాయలను వడ్డించడం జరుగుతుంది. వ్యాధుల భోజనానికి దాదాపు రోజుకు 2000 రూపాయలు ఖర్చవుతుందని మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. కోడిగుడ్లు పెట్టినట్లయితే మరో 1500 రూపాయలు అదనంగా ఖర్చవుతుందని చెబుతున్నారు. వంట మనుషులకి , ప్రభుత్వం ఒక వెయ్యి రూపాయలు చెల్లిస్తుంది. చాలీచాలి చాలని వేతనం అని కార్మికులు ఉద్యమించడంతో ప్రభుత్వ 3000 ప్రకటించినప్పటికీ, ఒక వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లిస్తుంది. విద్యార్థుల హాజరు పార్టీక ప్రకారం 500 మంది విద్యార్థులకు 30 నుండి 35 కేజీల బియ్యం మోను ప్రకారం వండుతారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కొరకు , ఒక ప్లేట్ కు తొమ్మిది నుండి పది రూపాయల వరకు చెల్లిస్తున్నారు. వడ్డించినప్పుడు పండ్లు తీసుకువచ్చి పంచుతారు. మధ్యాహ్న భోజనం కార్మికులు కూరగాయలతో పాటు ,ఉప్పు ,కారం , పసుపు, చింతపండు ,బాగా రాకు , మసాలాలు ,జీలకర్ర, ఆవాలు, అల్లం , ఎల్లిగడ్డ, కొనుగోలు చేస్తారు. రెండు రోజులకు 500 రూపాయల కలప వంటకు వాడుతారు. కాలంలో బిల్లులు రాకపోవడంతో కిరాణా షాపు కూరగాయల వద్ద దాదాపు 2 లక్షల రూపాయలు అప్పులు పాలయ్యానని నిర్వాహకురాలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు కొరకు అప్పు పుట్టడం లేదు

నిర్వాహకురాలు పాషికంటి సరోజన



మధ్యాహ్న భోజన పథకం అమలు కొరకు అప్పు పుట్టడం లేదు.ఇప్పటివరకు రెండు లక్షల రూపాయల అప్పు మీద పడ్డది. తప్పనిసరి పరిస్థితులలో విద్యార్థులకు వండి పెడుతున్నాం. కిరాణా షాపులలో, పండ్ల షాపులలో, కూరగాయల షాపులలో తీసుకున్న సరుకులకు డబ్బులు చెల్లించకపోవడంతో అరువు ఇవ్వడం లేదు. తాకట్టు పెట్టి సరుకులు కొనాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలి.

మణిపూర్ ఘటన పై శాంతి ర్యాలీ

నవతెలంగాణ - భువనగిరి



మణిపూర్ లో జరుగున్నవంటి హింసలకు వ్యతిరేకంగా జిల్లా పాస్టర్స్ ఫాలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరి పట్టణ ఆధ్వర్యంలో హైదరాబాద్ చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరుకు శాంతి ర్యాలీ పట్టణ క్రైస్తవ చర్చిల తర్పున నిర్వహించారు. పట్టణంలోని అనేక సంఘాలు పాల్గొని మణిపూర్‌లో జరిగిన్నటువంటి హింసా కార్యక్రమంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడారు . భారత సమాజం లో స్వేచ్ఛ, సమానత్వం మానవు లంత ఒక్కటే అనే ఆశయానికి విరుద్ధంగా మణిపూర లో సంఘటనలు జరగుతున్నాయన్నారు. విద్రోహుల నుండి దేశ పాలకులు ప్రధాన మంత్రి కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెవ జాన్సన, చందర్య, ఇస్సాకు, పాల్ రెడ్డి,బట్టు ప్రేమ్ కుమార్, ప్రసాద్, బాలస్వామి, జూలియాన,బట్టు రామ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ -మోత్కూరు



మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని విశ్వ భారతి ఉన్నత పాఠశాల 2005-06 ఎస్ఎస్ సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆనాటి స్నేహితులంతా ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అన్నందాసు వెంకటేష్, ఎండి. ఆయాజ్, దూడల లోకేష్, ఇక్కిరి నరేష్, బోయపల్లి నరేష్, మూడ శ్రీను, డేవిడ్, గణేష్, అశోక్, వేముల వెంకన్న, ఎం. మల్లేష్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977-1978 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని మర్యాల గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు.తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి,ఏలేజర్, బెత్ శెభ, విద్యార్థులు గణేష్ చారి, నర్సిరెడ్డి, సత్తిరెడ్డి,బాలయ్య, బాల్ రెడ్డి, బిక్షపతి గౌడ్, వీర కుమార్, మిత్రులు పాల్గొన్నారు.



101 యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భూధాన్ పోచంపల్లి

పురపాలక కేంద్రంలోని 101 యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారము స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు చేరాల సుధీర్, అధ్యక్షులు వంగూరి బాలకృష్ణ ,ఉపాధ్యక్షులు దొడ్డమోని సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వంగూరి సతీష్, కోశాధికారి వంగూరి శివశంకర్, సహాయ కార్యదర్శి చేరాల లింగస్వామి, క్రీడల కార్యదర్శి దొడ్డమోని దినేష్ యాదవ్, సాంస్కృతిక కార్యదర్శులు దొడ్డ మోని ఉదయ్ కుమార్, బాలమైసి నవీన్ లను ఏకగ్రీవంగా యూత్ గౌరవ సభ్యులు ,సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన వంగూరి బాలకృష్ణ మాట్లాడుతూ యువజన సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వంగూరి క్రాంతి కుమార్, కట్కూరి లింగస్వామి, చేరాల నవీన్, చేరాల కిరణ్ కుమార్, చెక్క శ్రీకాంత్, వంగూరి రాము , చేరాల విక్రం, వంగూరి రాజ్ కుమార్, పుప్పాల శివ, కస్తూరి అనిల్, అన్నం రాజేష్ ,చిట్టిమల్ల ప్రవీణ్, గునిగంటి శంకర్, ధనమోని శివ,చేరాల నిఖిల్, చేరాల మహేందర్, గాండ్ల సన్నీ, పుప్పాల సతీష్, బాలమైసి అరవింద్, కౌడే రవి , తదితరులు పాల్గొన్నారు.